నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీనగర్‌లో ఉగ్రదాడి.. సీఆర్పీఎఫ్ జవాన్ మృతి

శ్రీనగర్, ఏప్రిల్ 4:: జమ్మూకశ్మీర్‌లో ఇవాళ ఉగ్రదాడి జరిగింది. శ్రీనగర్‌లో జరిగిన ఈ ఘటనలో ఓ సీఆర్పీఎఫ్ జవాను మృతిచెందాడు. మరో జవాను గాయపడ్డాడు. గాయపడ్డ జవాన్లను సమీపంలోని ఎస్ఎంహెచ్ఎస్ హాస్పిటల్‌కు తరలించారు. భద్రతా దళాల చెక్ పాయింట్ వద్ద ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాడి చేసిన తర్వాత ఉగ్రవాదులు పారిపోయినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన ప్రదేశాన్ని సీజ్ చేశారు. సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. పుల్వామాలో ఇద్దరు వలస కూలీలపై కాల్పుల ఘటన జరిగిన రెండు గంటల వ్యవధిలోనే ఉగ్రదాడి జరగడం శోచనీయం. వరుసగా రెండవ రోజు బీహారీ కూలీలపై కాల్పులు జరిగాయి.

హైదరాబాద్ | మంగళవారం 5-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 203 | పేజీలు:4 | వెల: రూ.1/-

ఏపీకి రూ.28 వేల కోట్లు ఇచ్చాం: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: రెవెన్యూ లోటు కింద ఏపీకి రూ.28 వేల కోట్లు ఇచ్చామని కేంద్రం ప్రభుత్వం వెల్లడించింది. రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రం జవాబిచ్చింది. రెవెన్యూ లోటు కింద 2015-20 నుంచి 2020-21 ఆర్థిక ఏడాదిల్లో.. ఏపీకి రూ.28 వేల కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది. ఏపీ విభజన చట్టం 2014 ప్రకారం, ఆర్థికసంఘాల సిఫార్సుల ప్రాతిపదికన.. ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్రం స్పష్టం చేసింది.

మరోవైపు సీమ ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు ఇవ్వలేదని కేంద్రం తెలిపింది. ఇప్పటికే ఉన్న కొన్ని అనుమతుల్లో సవరణలు కోరుతూ.. ఏపీ సీఎం నుంచి మూడు లేఖలు అందాయని కేంద్రం పేర్కొంది. 4 అంశాలపై మరిన్ని వివరాలు కోరుతూ 2 లేఖలను ఏపీకి పంపామని, అక్కడి నుంచి ఇంతవరకూ సరైన సమాధానం రాలేదని కేంద్రం తెలిపింది

వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్, ఏప్రిల్ 4: జంటనగరాల్లో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌అన్నారు. సోమవారం ఖైరతాబాద్, ముషీరాబాద్, అంబర్ పేట నియోజకవర్గాల పరిధిలో ఎస్ఎన్డిపీ కార్యక్రమం క్రింద అభివృద్ధి పనులు చేపట్టిన నాలాలను మంత్రి తలసాని పరిశీలించారు.వరద ముంపుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న నాలాల పై అక్రమ నిర్మాణాలు అన్ని తొలగిస్తామని మంత్రి తెలిపారు.ప్రతి ఏటా వర్షాకాలంలో నాలాకు ఎగువ నుండి వచ్చే వరదతో ముంపుకు గురవుతున్ననాలా పరిసర కాలనీలు, బస్తీలు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశంతో పరిష్కారం చేస్తున్నట్టు తెలిపారు.

మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ఎన్ఎన్డీపీ కార్యక్రమంతో శాశ్వత పరిష్కారం లభిస్తుంది మంత్రి వెల్లడించారు.వరదలు వచ్చిన సమయాలలో జరుగుతున్న ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు శాశ్వత చర్యలు తీసుకుంటున్నామని, ఎన్ని కోట్ల నిదులైనా ఖర్చు చేస్తామని మంత్రి తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈసందర్భంగా మంత్రి తలసాని వెంట ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, జీహెచ్ఎంసి కమిషనర్ లోకేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో బస్సు ప్రమాదం

ఏప్రిల్ 4:హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. మరో ముప్పై మందికి పైగా గాయపడ్డారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఆర్టీసీ బస్సు సోమవారం మనాలి నుంచి షిమ్లా వెళ్తుండగా, చండీఘడ్-మనాలి హైవేపై ఈ ప్రమాదం జరిగింది. బస్సు అదుపు తప్పి పర్వతం పక్కనున్న గోడను ఢీకొంది. బస్సు ప్రమాదంలో గాయపడ్డవారిని స్థానిక ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తునట్లు మండి ఎస్పీ షాలిని అగ్నిహోత్రి చెప్పారు.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ జ్ఞానమలా - పి.బి.లా
దీనావళిగా నిలచిన చిన్మయరూపునకు
మానిత క్రిస్‌గోపాలుని
ప్రాణాతిమధురమగు జలంచి త్రుప్తుతి జేతుకి !!

(ఏప్రిల్ 5 ఐ.టీ. విజ్ఞాని సేనాపతి క్రిస్ గోపాల్‌పుట్టిన రోజు...)

-రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

అర్హులైన ప్రతి ఒక్కరికీ మత్స్యసహకార సొసైటీలో సభ్యత్వం: తలసాని

హైదరాబాద్, ఏప్రిల్ 4:సొసైటీలలో సభ్యత్వం మత్స్యకారుల హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరికి సభ్యత్వం కల్పిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో అన్ని జిల్లాల మత్స్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల రిజిస్ట్రేషన్ స్పెషల్ డ్రైవ్ కు సంబంధించిన పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకుని వారికి వివిధ రకాల పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. రాష్ట్రంలో నూతన నీటి వనరుల విస్తీర్ణం భారీగా పెరగడం, దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచితంగా చేప, రొయ్య పిల్లల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలతో రాష్ట్రంలో మత్స్య సంపద కూడా భారీగా పెరిగిందని వివరించారు. సంపదను సృష్టించాలి...దానిని పేదలకు పంచాలనే ఆలోచనల మేరకు రాష్ట్రంలో పెరిగిన మత్స్య సంపదను ఈ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి మత్స్యకారుడికి అందిస్తామని చెప్పారు.

అందులో భాగంగానే నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఏర్పాటు, నూతన సభ్యత్వం పై స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 4,753 సొసైటీలు ఉన్నాయని, అందులో 3,47,901 మంది సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఇంకా 1185 సంఘాలను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. మే 15 వ తేదీ లోగా 100 శాతం సభ్యత్వ నమోదును పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తమకు సభ్యత్వం రాలేదని అర్హులైన ఏ ఒక్క మత్స్యకారుడు అనేందుకు అవకాశం ఇవ్వవద్దని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా సభ్యత్వ నమోదు చేపట్టాలని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండిన మత్స్యకార కులాలకు చెందిన వారిని అర్హులుగా గుర్తించాలని సూచించారు. అదేవిధంగా జీవో 98 లో పేర్కొన్న 30 మత్స్యకార కులాలకు చెందిన వారు అర్హులు అవుతారని (సంబంధిత తహసిల్దార్ జారీ చేసిన కుల ధృవీకరణ ను పరిగణలోకి తీసుకోవాలని) చెప్పారు. స్థానికంగా నివాసం ఉంటున్న వారు అర్హులు అని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులు సభ్యత్వం పొందేందుకు అనర్హులు అవుతారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలో మత్స్యకార సంఘాల ఏర్పాటుకు స్థానిక గిరిజనులు మాత్రమే అర్హులు అని, మత్స్యకార వృత్తిపై నైపుణ్యం లేని వారికి అవసరమైన శిక్షణ ఇప్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. మత్స్యరంగ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలతో విదేశీ సంస్థలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని, ఇది తెలంగాణ మత్స్య రంగ చరిత్రలో సువర్ణ అధ్యాయం అని అన్నారు. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అమెరికా పర్యటనలో ఫిష్ ఇన్ అనే సంస్థ వెయ్యి కోట్ల రూపాయలను పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత ను వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

ఆ మంత్రం మరువొద్దు.. అప్‌డేట్ కావాలి : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 4: ప్రతి విద్యార్థి, టీచర్ స్కిల్, అప్ స్కిల్, రీ స్కిల్ అనే మంత్రాన్ని మరిచిపోకూడదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అప్‌డేట్ కావాలి. అప్ స్కిల్, రీస్కిల్ చేసుకోకపోతే వెనుకబడిపోతామని కేటీఆర్ పేర్కొన్నారు.

గోల్కొండ పరిధిలోని తారామతి భారదరి రిసార్ట్‌లో తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 2021-22 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలను మంత్రులు పరిశీలించారు. విద్యార్థుల ఆవిష్కరణలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కరోనా తర్వాత చాలా పెద్ద ఎత్తున విద్యాశాఖ నేతృత్వంలో, ఐటీ శాఖ సహకారంతో చేసిన ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో పాల్గొనేందుకు 5,387 స్కూల్స్ రిజిస్టరేషన్ చేసుకున్నాయి. 7,003 టీచర్లు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. 25,166 విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 11,037 టీమ్స్ తమ ఆవిష్కరణలను పంచుకున్నాయి. 79 టీమ్స్ షార్ట్ లిస్ట్ లో చేరాయి. 20 టీమ్స్ గ్రాండ్ ఫినాలేకు చేరుకున్నాయి. జ్యూరీ ద్వారా ఎంపిక కాబడ్డ ఐదు టీమ్స్‌కు బహుమతులు ప్రదానం చేసినట్లు కేటీఆర్ తెలిపారు.

చిన్న పిల్లల్లో సృజనాత్మకత అధికంగా ఉంటుంది. చాలా ప్రయోగాలు చేస్తుంటారు. వేసవి సెలవుల్లో మా అమ్మమ్మ ఊరికి వెళ్లినప్పుడు.. చిన్న చిన్న ప్రయోగాలు చేసేవాళ్లం. చిన్న చిన్న బల్బుల్లో ఫిలమెంట్ తీసేసి, నీళ్లు పోసి, రకరకాల కలర్లు వేసి రిఫ్లెక్టింగ్ చేసేవాళ్లం. ఆ మాదిరిగానే చాలా మంది చిన్న పిల్లలు ప్రయోగాలు చేసి, అందులో కొత్త అంశాన్ని తెలుసుకోవాలనే ఉత్సాహం, ఉత్సుకతతో ముందుకు వెళ్తుంటారని కేటీఆర్ తెలిపారు.

జపాన్ పిల్లలను అభినందించాలి..

మూడు నాలుగేండ్ల కింద జపాన్‌లోని సుజుకి కంపెనీ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లాం. సుజుకి మ్యూజియం చూపించారు. అక్కడ తిరుగుతుంటే.. మొదటి బైక్ తయారీ వివరాలు కనిపించాయి. అవన్నీ చూసుకుంటూ వస్తున్నాం. రెండు, మూడు తరగతులకు చెందిన 30 నుంచి 40 మంది స్కూల్ పిల్లలు ఆ మ్యూజియంలో తిరుగుతున్నారు. వారందర్నీ అక్కడి తిప్పి చూపిస్తున్నారు.

ఆ పిల్లలు ఏం పరిశీలిస్తున్నారో అర్థం కాక అక్కడ పని చేస్తున్న ఎగ్జిక్యూటివ్‌ను అడిగాను. గమనించాలని వారు సూచించారు. వెండింగ్ మిషిన్స్‌ను పిల్లలు పరిశీలిస్తున్నారు. ఒక వస్తువు తయారీకి సంబంధించిన వివరాలను చూపిస్తున్నారు. నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఆ దేశంలో భూకంపాలు, సునామీలు ఉంటాయి. ప్రకృతి అనుకూలతలు లేవు. సరిగా నీళ్లు ఉండవు. ఇవన్నీ లేకున్నప్పటికీ వారికి బ్రెయిన్ పవర్ ఉంది. ఆసియా ఖండంలోనే ఒక శక్తిగా, ఆర్థికంగా ఎదిగారు. జపాన్ పిల్లలకున్న సృజనాత్మకతను అభినందించాల్సిన అవసరం ఉందన్నారు.

బియ్యం, పాలు ఎక్కడ్నుంచో వస్తాయో తెలియదు..

మన పిల్లలకు బియ్యం ఎక్కడ్నుంచో వస్తాయో తెలియదు. పాల ఉత్పత్తి కూడా తెలియదు. చిన్నప్పుడే తల్లిదండ్రులు వారిని డాక్టర్, ఇంజినీర్ అవుతావా? అని అడిగి మూస ధోరణిలో వెళ్తారు. సహజంగా ఉండే తెలివికి పదును పెడితే.. మీరు ఒకరి దగ్గర పని చేయడం కాదు.. మీరే వందల వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉంది. అందుకే తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశాం. పిల్లలకు ఇష్టమున్న కోర్సులను చదివించాలని కేటీఆర్ సూచించారు.

ఇన్నోవేషన్‌కు పెద్దపీట

ఇన్నోవేషన్‌కు పెద్దపీట వేస్తున్నాం. రూరల్, సోషల్ ఇన్నోవేటర్లు ముందుకు రావాలి. టెక్నాలజీకి సంబంధించి టీ హబ్ ఏర్పాటు చేశాం. హార్డ్ వేర్‌కు సంబంధించి టీ వర్క్స్ ఏర్పాటు చేసుకున్నాం. మహిళా పారిశ్రామికవేత్తల కోసం వీహబ్ అందుబాటులోకి తెచ్చాం. ఇన్నోవేషన్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ఇండస్ట్రీని, సైంటిఫిక్ ల్యాబ్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు రిచ్ అనే సంస్థను ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు.

కొత్తగా యూత్ హబ్

కొత్తగా యూత్ హబ్ ను ఏర్పాటు చేసుకోబోతున్నాం. ఈ యూత్ హబ్‌ను రూ. 6 కోట్ల ఫండ్‌తో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వ కార్యక్రమాలు రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయి. టీచర్ ఇన్నోవేషన్ పోర్టల్‌ను ప్రారంభించుకున్నాం. మన ఊరు ? మన బడి కార్యక్రమం కింద 12 రకాల అంశాలను ప్రవేశపెట్టాం. అదనపు తరగతి గదులు, ఫర్నీచర్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ ఇవ్వబోతున్నాం. కరోనా సమయంలో తలెత్తిన ఇబ్బందులు భవిష్యత్‌లో రాకుండా అత్యుత్తమ బోధన అందించేందుకు డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేస్తున్నాం. మన ఊరు మన బడి దేశానికే ఆదర్శంగా నిలవబోతుందన్నారు. కొత్త పోకడలు పోతున్న విద్యా వ్యవస్థ పట్ల టీచర్లకు కూడా అవగాహన కల్పించాలని కేటీఆర్ సూచించారు.

ఏడాదిలోగా ముంబై-గోవా హైవే పనులు పూర్తి : నితిన్ గడ్కరీ

ముంబై , ఏప్రిల్ 4: ఏడాదిలోగా ముంబై-గోవా హైవే పనులు పూర్తవుతాయని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. భూసేకరణ, అటవీ శాఖ, రైల్వేల నుంచి అనుమతుల కోసం ప్రాథమిక పనుల్లో జాప్యం జరిగిందని అన్నారు. ముంబై-గోవా హైవే పనులు పదకొండు దశల్లో జరుగుతున్నాయని చెప్పారు.

ముంబై-గోవా హైవే ఈ ప్రాంతానికి గుండెకాయ వంటిదని ఈ ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని మంత్రి గడ్కరీ తెలిపారు. ముంబై-గోవా హైవేను మంగళూర్ వరకూ పొడిగిస్తామని అన్నారు. ముంబై-గోవా హైవేపై ప్రభుత్వ భూములు అందుబాటులో ఉంటే లాజిస్టిక్స్ పార్క్, ట్రక్ టెర్మినల్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కొంకణ్ ప్రాంతంలో ప్రత్యేక ఆర్థిక మండలి ద్వారా త్వరలో 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు సమకూరుతాయని అన్నారు. రాయ్‌గఢ్ జిల్లాలో రూ 131.87 కోట్లతో చేపట్టిన మూడు జాతీయ రహదారుల ప్రాజెక్టులను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. రూ 430 కోట్లతో 42 కిలోమీటర్ల పొడవైన రహదారుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

వందేళ్ల అబద్ధాలను అప్పుడే చెప్పేసిన బీజేపీ..! : మంత్రి నిరంజన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 4:: కేంద్రలోని బీజేపీ పార్టీ వందేళ్ల అబద్ధాలను అప్పుడే చెప్పేసింది. అధికారం కోసం అబద్ధాలను నమ్ముకున్న ఏకైక పార్టీ బీజేపీ అని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శించారు. జిల్లాలోని మూసాపేట మండల కేంద్రంలో కేంద్రమే వడ్లను కొనుగోలు చేయాలనే నినానదంతో టీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ రైతులతో సమావేశం నిర్వహించి కేంద్రం రైతుల పంటలు కొనడం లేదని, తాము అధికారంలోకి వస్తే రైతులు పండించిన అన్ని పంటలు కొంటామని చెప్పారు.

కేంద్రంలో అధికారంలోకి రావడానికి ప్రణాళికాబద్ధంగా అబద్ధాలతో ప్రజలను నమ్మించారని ధ్వజమెత్తారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్రమోదీ చెప్పిన మాటల ఆధారాలను మంత్రులు, ఎంపీల బృందం చూపితే కేంద్రమంత్రి పీయూష్ గోయల్ మొహంలో నెత్తురు చుక్క లేదు. కేంద్ర ప్రభుత్వానికి ముందుచూపు లేని కారణంగా దేశంలోని రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ పాలన సరిగా లేకుంటే ప్రజలు శిక్షిస్తారు. మీ శాపనార్థనాలతో కేసీఆర్‌కు ఒరిగేది ఏమీ లేదన్నారు. వెయ్యేళ్ల కింద రాజులు కట్టిన దానికంటే రెట్టింపుగా యాదాద్రి ఆలయాన్ని నిర్మించారు. దేశమంతా తిరిగి బీజేపీ బండారాన్ని బయటపెడతామన్నారు. ధాన్యం కొనే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

తెలంగాణకు వర్ష సూచన-ఎల్లో అలర్ట్ జారీ

ఉరుములు, మెరుపులతో వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 4:భగ్గుమంటున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న తెలంగాణ ప్రజానీకానికి కాస్తంత రిలీఫ్ కలిగించే వార్త ఇది.. ఇక ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగించే కబురును హైదరాబాద్ వాతావరణ శాఖ వినిపించింది. రాబోయే మూడు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

ఈ జిల్లాల్లో రేపు (మంగళవారం) వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. మరఠ్వాడా నుంచి కర్నాటక మీదుగా తమిళనాడు దాకా విస్తరించి ఉన్న ద్రోణి కారణంగా రాష్ట్రంలో వర్షాలు పడే చాన్స్ ఎక్కువగానే ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాబోయే 48 గంటల పాటు హైదరాబాద్ నగరమంతా మేఘావృతం అయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిస్తుందని, ప్రజలు అప్రమ్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

ఆ విద్యార్థుల ఆలోచనాశక్తికి అభినందనలు : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 4: గోల్కొండ పరిధిలోని తారామతి భారదరి రిసార్ట్‌లో తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 2021-22 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలను మంత్రులు పరిశీలించారు. విద్యార్థుల ఆవిష్కరణలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలుగా రూపాంతరం చెందే పిల్లలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పని చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వారిలో ఉన్న ఆలోచనాశక్తికి అభినందనలు తెలియజేస్తున్నాను. విద్యార్థుల్లో ఉన్న మేధాశక్తిని వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు.

పేదరికంలో ఉన్న పిల్లలను ప్రోత్సహించాలని సీఎం కేసీఆర్ చెబుతుంటారు. యునిసెఫ్ సహకారంతో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలన్నారు. సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నాం. ఇవాళ విజేతలుగా నిలిచిన విద్యార్థులందరూ భవిష్యత్‌లో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆకాంక్షించారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తెలంగాణ కేరాఫ్ అడ్రస్ -మంత్రి కొప్పుల

హైదరాబాద్, ఏప్రిల్ 4:ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి, అన్ని రంగాల అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నారని ఎస్సీ,మైనారిటీశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, బాబాసాహెబ్ అంబేద్కర్ రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాల కమిటీ పోస్టర్స్,బ్రోచర్స్ ను మంత్రి కొప్పులఈశ్వర్ ఆవిష్కరించారు. జగ్జీవన్ రామ్ 115వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి కొప్పుల శుభాకాంక్షలు తెలిపారు.ఎంపిగా, కేంద్ర మంత్రిగా,ఉప ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ వర్కింగ్ ఛైర్మన్లు రావుల విజయ్ కుమార్,నాగారం బాబు మాదిగ,వైస్ ఛైర్మన్లు ఏర్పుల యాదయ్య,తూర్పాటి హన్మంతు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం కేరాఫ్ అడ్రస్ గా మారిందని అన్నారు. అభివృద్ధి విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశం మొత్తానికి దిక్సూచిగా మారిందన్నారు. గతేడాది ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం 67వేల787కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 93వేల489కోట్లు ఖర్చు చేయనున్నామని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అందరికి మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. వెయ్యి గురుకులాల ద్వారా ఇంగ్లీష్ మీడియంలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు.ఐటి,ఫార్మా,రియల్ ఎస్టేట్, ఇంజనీరింగ్,ఏరోస్పేస్ రంగాలు మరింత దూసుకుపోతున్నాయన్నారు.తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రభాగాన నిలిచిందన్నారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో
పాలపిట్ట బుక్స్ నిర్వహణలో

రాపోలు సీతారామరాజు రచన

పరావర్తనం

సాహిత్య వ్యాసాలు

ఆవిష్కరణ సభ



- అధ్యక్షత
  డా. ఎస్. రఘు
- ముఖ్య అతిథి & ఆవిష్కర్త
  శ్రీ జూలూరు గౌరీశంకర్
- విశిష్ట అతిథి
  శ్రీ దేశపతి శ్రీనివాస్
- గౌరవ అతిథి
  శ్రీ మామిడి హరికృష్ణ
- ఆత్మీయ అతిథి
  శ్రీ ఎం. నారాయణశర్మ
- పుస్తక సమీక్ష
  శ్రీ సాగర్ల సత్తయ్య

5 ఏప్రిల్ 2022
మంగళవారం సా. గం.6.00
పైడి జైరాజ్ ప్రివ్యూ థియేటర్
రవీంద్రభారతి, హైదరాబాద్

జీవవైవిధ్య నెలవులు మహాసముద్రాలు..!

(05 ఏప్రిల్ 'భారత జాతీయ సముద్ర దినం' సందర్భంగా)

భూతలంపై 70 శాతం జలావరణమే. జల వనరుల్లో 98 శాతం సాగర జలమే. సముద్రాలు సకల జీవరాసులకు నెలవు. భూగ్రహం మీద వెలసిన మహాద్భుతం మహాసముద్ర సృష్టి మాత్రమే. జీవవైవిధ్యాలకు ఆదరువు, పర్యావరణ పరిరక్షణకు హితవరిగా సముద్రాలు విశ్వమానవాళికి ఎనలేని సేవలను అందిస్తున్నది. సముద్రడిని దైవంగా పూజించడం, తన సంతానంగా లక్ష్మి, చందమామలను భావించడం మన సంప్రదాయంలో ఉన్నది. సముద్రాలు సకల జీవరాశుల ఉనికికి, మనుగడకు ప్రత్యక్ష, పరోక్ష సంబంధాన్ని కలిగి ఉన్నాయి. సముద్రాల పరిశుద్ధ జల ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన కనీస బాధ్యత మనందరి మీద ఉన్నది. అనాదిగా సముద్రాలు వ్యాపార విస్తరణలు, ప్రయాణాలు, వస్తు రవాణలు, వర్ష దాతలు, సముద్ర జీవ సంపదలకు నెలవులుగా వినియోగించబడుతున్నాయి. సముద్ర జలాల ప్రాధాన్యతను అవగాహన చేసుకునేందుకు ప్రతి ఏటా 05 ఏప్రిల్ రోజున 'భారత జాతీయ సముద్ర దినం (నేషనల్ మారిటైమ్ డే ఆఫ్ ఇండియా)' పాటించుట 1964 నుంచి జరుగుతున్నది.

ఆధునిక మానవుడి అనాలోచిత, స్వార్థపూరిత కార్యాలతో సముద్రాలు కాలుష్య కేంద్రాలుగా మారుతూ, సముద్ర జీవులను, మానవజాతి ఉనికిని అతి ప్రమాదకర స్థితిలోకి నెట్టుతున్నాయి. సాగర కాలుష్యాల్లో రసాయన, కాంతి, శబ్ద, ప్లాస్టిక్ కాలుష్య రకాలు ఉన్నాయి. సముద్ర కాలుష్యానికి కారణంగా ప్లాస్టిక్, చెత్తాచెదారం, మురికినీరు, సముద్ర తవ్వకాలు, చమురు లీకేజీలు, వ్యవసాయరంగంలోని పురుగుమందుల వ్యర్థాలు, విషతుల్య రసాయనాలు, గాలి కాలుష్య ఫలిత ఆమ్లత్వం, సముద్ర రవాణ వ్యవస్థలు లాంటివి అతి ముఖ్యమైనవి. సముద్ర కాలుష్యంతో జలాల్లో ఆక్సీజన్ గాఢత తగ్గడం, సముద్ర జీవులు ప్రభావితం కావడం, పగడపు దిబ్బలు విచ్ఛిన్నం కావడం, మానవ ఆరోగ్య దెబ్బతినడం, ఆహార చక్రం కలుషితం కావడం, సముద్ర జీవుల పునరుత్పత్తి విఫలం కావడం లాంటి అవాంఛనీయ ప్రమాదకర మార్పులు ఏర్పడుతాయి.

సాగర కాలుష్యానికి ప్రధాన కారణంగా ప్రమాదకర ప్లాస్టిక్ అని గుర్తించబడింది. మానవులు వాడి వదిలేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు నేల కాలుష్యానికే కాకుండా సముద్ర జలాలకు చేరి సముద్ర జల కాలుష్యానికి కారణం అవుతున్నది. జీవ విచ్ఛిన్నం కావడానికి వందల సంవత్సరాలు తీసుకునే ప్లాస్టిక్స్ వల్ల సముద్ర జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా 18 బిలియన్ పౌండ్ల ప్లాస్టిక్ వ్యర్థాలు సాగరజలాలను కలుషితం చేస్తున్నాయి. ముఖ్యమైన ప్లాస్టిక్ వ్యర్థాల్లో సింగిల్-యూజ్ ప్లాస్టిక్స్, సిగరెట్ బట్స్, ఆహార పొట్లాలు, ప్లాస్టిక్ బ్రెవరేజ్ బాటిల్స్, ప్లాస్టిక్ బాటిల్ మూతలు, స్ట్రాలు, టేబుల్‌వేర్, ప్లాస్టిక్ బ్యాగులు, స్టిరర్స్ లాంటివి వస్తాయి. సముద్ర జలాల్లో 25 ట్రిలియన్ల ప్లాస్టిక్ పదార్థ వ్యర్థ ముక్కలు ఉన్నాయని, వీటిలో 2.69 లక్షల టన్నులు సముద్ర నీటిపై తేలుతున్నాయని, చదరపు కిమీకు 4 బిలియన్ మైక్రో-ఫైబర్ ప్లాస్టిక్స్ సాగర గర్భానికి చేరుతున్నాయని అంచనా వేశారు. సముద్రానికి చేరిన 80 శాతం ప్లాస్టిక్స్ నేల-ఆధార మూలాలైన పరిశ్రమల వ్యర్థాలు, వ్యర్థాల నియంత్రణ సక్రమంగా లేకపోవడం, వ్యక్తులు వదిలిన వ్యర్థాలు, మురికి నీరు లాంటివి గుర్తించబడినవి. సముద్ర కాలుష్యంతో ప్రతియేటా ఒక మిలియన్ సాగర పక్షులు చనిపోతున్నాయి. సముద్ర గర్భంలో ప్లాస్టిక్ బ్యాగులు, లోహ డబ్బాలు, చేపలు పట్టే పరికరాలు, గాజు బాటిళ్లు, బూట్లు, టైర్లు లాంటి అనేక వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కొన్ని సముద్ర ప్రాంతాల్లో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరి, ఆ జలాల్లో ప్రాణవాయువు గాఢత పడిపోవడంతో జీవ మనుగడ సాధ్యపడడం లేదు. ఇలాంటి సముద్ర జలాలున్న ప్రాంతాలను 'డెడ్ జోన్స్' అంటున్నాం. నేడు ప్రపంచవ్యాప్తంగా 500లకు పైగా డెడ్ జోన్లు ఉన్నాయని అంచనా.

ప్లాస్టిక్ కాలుష్యంతో ప్రతి ఏటా ఒక లక్ష సముద్ర జంతువులు చనిపోతున్నాయి. గాలి కాలుష్యంతో వెలువడిన కార్బన్ వ్యర్థాలు సముద్ర జలాల ఆమ్ల స్వభావాన్ని 150 శాతం పెంచుతున్నాయి. దాదాపు 80 శాతానికి పైగా మురికి నీటిని శుద్ధి చేయకుండానే సముద్రాల్లోకి వదిలి వేయడం జరుగుతోంది. చమురు లీకేజీ వల్ల 12 శాతం మరియు నగరాలు/పరిశ్రమల వల్ల 36 శాతం చమురు సముద్ర జలాల్లో కలుస్తున్నది. పడవలు, ట్లాంకర్లు లాంటి రవాణ యంత్రాల వల్ల సముద్రం శబ్ద కాలుష్యానికి లోనై చేపలు, ఇతర జంతువులకు హానిని కలుగజేస్తుంది. ఇలాగే ప్లాస్టిక్ కాలుష్యం పెరిగితే 2050 నాటికి సముద్రాల్లో చేపల కన్న ప్లాస్టిక్ కలుష్య వ్యర్థాలు అధికం అవుతాయని అంచనా. సముద్ర జంతువులు ఆహారానికి, ప్లాస్టిక్‌కు తేడా గుర్తించనందున, ప్లాస్టిక్‌ను ఆహారంగా భ్రమపడి తినడం జరుగుతుంది. జీర్ణ కావడానికి అవకాశం లేని ప్లాస్టిక్‌తో జంతువులు చనిపోవడం జరుగుతుంది. చైనా, ఇండోనేషియా దేశాలు అధికంగా 33 శాతం ప్లాస్టిక్ కాలుష్యానికి కారణం అవుతున్నాయి. సముద్రజలాల్లో ప్లాస్టిక్ విచ్ఛిన్నం కావడానికి 400 ఏండ్ల సమయం పడుతుంది.

సముద్ర కాలుష్యాన్ని అరికట్టే మార్గాలుగా చెత్త నియంత్రణ, ప్లాస్టిక్ వాడకాన్ని తగించడం (రెడ్యూజ్), తిరిగి వాడుకోవడం (రీయూజ్), ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడం తప్పక జరగాలి. ప్రమాదకర ప్లాస్టిక్‌ను నిషేధించడం, అతి ప్యాకేజీలను తగ్గించడం, షాపింగ్‌కు వెళ్లే సందర్భాల్లో స్వంత బ్యాగులను వెంట తీసుకెళ్లడం, పేపర్ బ్యాగులను వినియోగించడం, ప్లాస్టిక్ కాలుష్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసి వదలడం, మురికి నీటిని సముద్రాలు నదుల్లో కలువకుండా చూడడం లేదా శుద్ధి చేసిన తరువాతనే వదలడం, గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, చమురు లీకేజీలను అరికట్టడం, రేడియోధార్మిక వ్యర్థాలు సముద్రజలాలను చేరకుండా చూడడం, షిప్/ట్యాంకర్ల కదలికలను తగ్గించడం, వేస్ట్/రీయిన్ వాటర్ మేనేజ్‌మెంట్‌ను అభివృద్ధి చేయడం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ గ్రీన్ ఉత్పత్తులను రూపొందించడం లాంటి చర్యలను తీసుకోవాలి. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణలో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్, రికవర్ మంత్రాలను సదా పాటిద్దాం. సముద్రాలను పరిశుద్ధ దేవాలయాలుగా పూజిద్దాం. మన ఆరోగ్య భవితకు మనమే పునాదులు వేసుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రైతులను రెచ్చగొట్టి వరి వేయించిన బీజేపీ నేతలు ఎక్కడా ?

నిజామాబాద్, ఏప్రిల్ 4:తెలంగాణ మీద కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పచ్చబడితే వాళ్లు ఓర్వలేకపోతున్నారన్నారు. తెలంగాణలో పండిన వరి ధాన్యం సేకరణలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యపు ధోరణికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో రైతులు,నిరసన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పెద్ద ఎత్తున రైతులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో పండిన వరి ధాన్యాన్ని పూర్తిగా కొనాల్సిందే అని ఈ సందర్భంగా రైతులు నినాదాలు చేశారు. వివిధ సందర్భాల్లో వరి వేయమని బిజెపి నాయకులు రైతులను రెచ్చగొట్టిన వీడియోలను మంత్రి వేముల నిరసన సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్ మీద ప్రదర్శించి చూపించారు. రైతులు,టిఆర్ఎస్ శ్రేణులు వీడియోలు ఆసక్తిగా చూసి, బీజేపీ నాయకులను వదిలే ప్రసక్తే లేదని నినాదాలు చేశారు. బీజేపీ నాయకుల ఇండ్ల ముందు ధాన్యం పారబోస్తానని శపథాలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ.. తెలంగాణ రైతుల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి నీళ్లు,24 గంటల ఉచిత కరెంట్,పెట్టుబడి సాయం,రైతు భీమా లాంటివి అందిస్తున్నారని అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా బీజేపీవి అన్ని అబద్దాలే అని విమర్శించారు. కరెంట్ కోసం రూ.10 వేల కోట్లు,రైతు బంధు కోసం రూ.14 వేల కోట్లు, రైతు భీమా కోసం 3,700 కోట్లు ఏడాదికి ఖర్చు చేస్తున్నారని వివరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కేసీఆర్ అమలు చేసే రైతు సంక్షేమ కార్యక్రమాలు లేవని అన్నారు. కేసీఆర్ వల్ల తెలంగాణలో సాగు విస్తీర్ణం, పంటల దిగుబడి పెరిగిందన్నారు. తెలంగాణ రైతులు ఆర్థికంగా బాగుపడాలని ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. రెండేళ్లుగా కేంద్రంలోని మోడీ బీజేపీ తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనేందుకు ఆటంకాలు సృష్టిస్తోందని మండిపడ్డారు.

తెలంగాణ ధాన్యాన్ని కొనాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ని మా మంత్రుల బృందం కలిస్తే.. వడ్లు కొనమని తెగేసి చెప్పారన్నారు. పైగా తెలంగాణ ప్రజలు నూకలు తినాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అవమానించేలా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మమ్మల్ని వంద అన్న పడతాం మా తెలంగాణ సమాజాన్ని అంటే అస్సలు ఊర్కోమన్నారు. ఇక్కడి బీజేపీ నాయకులు కేంద్రమంత్రికి వత్తాసు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రైతులను రెచ్చగొట్టి వరి వేయించిన బండి సంజయ్,కిషన్ రెడ్డి ఎక్కడా..అని ప్రశ్నించారు. కేంద్రం మెడలు వంచైనా తెలంగాణ ధాన్యం కొనిపిస్తామని తెలిపారు. తెలంగాణ వడ్లు కొనే వరకు కేంద్రంలోని బీజేపీని,రాష్ట్ర బీజేపీ నాయకుల్ని ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు.

శ్రీరామనవమి ఏర్పాట్లపై మంత్రి పువ్వాడ సమీక్ష

భద్రాద్రి, ఏప్రిల్ 4: శ్రీరామనవమి ఏర్పాట్లపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈసారి భద్రాద్రి సీతారాముల కల్యాణానికి భక్తులను అనుమతించాలని నిర్ణయించారు. కరోనా కారణంగా ప్రభుత్వం గత రెండేళ్లు భక్తులను అనుమతించలేదు. ఈసారి భక్తులు పెద్దఎత్తున రానున్నందున మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి పువ్వాడ ఆదేశించారు.

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

హైదరాబాద్, ఏప్రిల్ 4: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం కవాడీగూడ డివిజన్ దేవీప్రసాద్‌బాగ్‌లో సీఎం సహాయనిధి కింద విడుదలైన చెక్కును బాధితురాలు టి. పరమేశ్వరికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక వైద్యం అందుకోవడానికి రోగి ప్రాణాలు కాపాడడానికి సీఎంఆర్ఎఫ్ ఎంతో దోహదం చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నగర నాయకుడు ముఠా జైసింహ, కవాడీగూడ డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అంబులెన్సులను జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డా.మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:కేంద్ర ఆరోగ్య డ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా.మన్‌సుఖ్ మాండవీయ, సహాయ మంత్రి డా. భారతి ప్రవీణ్ పవార్ 33 అంబులెన్స్‌లను (13 అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు, 20 బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు) జెండా ఊపి ప్రారంభించారు. న్యూదిల్లీలోని నిర్మాణ్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కేంద్ర రసాయనాలు డ ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీ భగవంత్ ఖుబా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల ద్వారా అందించే సౌకర్యాలు, సేవల గురించి కేంద్ర మంత్రులకు అధికారులు వివరించారు.

మన దేశంలో కొవిడ్ ప్రతిస్పందన కోసం కేటాయించిన నిధుల నుంచి కొంత మొత్తాన్ని... ఏఎల్ఎస్ అంబులెన్స్‌లు, బీఎల్ఎస్ అంబులెన్స్‌లు, సంచార ఆరోగ్య కేంద్రాలు, సంచార రక్త సేకరణ వాహనాల కోసం 'ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రెసెంట్ సొసైటీస్' (ఐఎఫ్ఆర్‌సీ) కేటాయించింది. ఆరోగ్యం, వివత్తు ప్రతిస్పందన సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శాఖలకు ఈ 33 అంబులెన్స్‌లను అందించారు. ఆయా శాఖలకు పంపుతున్న మొత్తం వైద్య వాహనాల్లో ఇవి ఒక భాగం.

కొవిడ్-19పై చేస్తున్న పోరాటంలో ఐఆర్‌సీఎస్ ముఖ్య పాత్ర పోషించింది, మహమ్మారి ప్రభావాన్ని తగ్గించడంలో ఘనంగా దోహదపడింది. దేశవ్యాప్తంగా రక్త లభ్యతను పెంచడానికి ఈ సంస్థ అనేక శిబిరాలు నిర్వహించింది ఈ సంస్థ చేపట్టిన విస్తృత శ్రేణి కార్యకలాపాలు ఐఆర్‌సీఎస్ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచాయి.

అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్‌లో ముగిసిన మూడు రోజుల రాష్ట్రీయ సంస్కృతి మహోత్సవ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:రాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవ్ 2022లో భాగంగా హైదరాబాద్ ఎన్టీఆర్ మైదానంలో మూడవ, చివరి రోజున జానపద కళాకారులు, శాస్త్రీయ సంగీత విద్వాంసులు అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 600 మందికి పైగా కళాకారులు, చేతి వృత్తుల కళాకారులు కలసి పాల్గొన్నారు.

కేంద్ర సాంస్కృతిక, పర్యాటక , ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ (డిఒఎన్ఇఆర్) ల మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ మహోత్సవ్ లక్ష్యం మన దేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని చటి చెప్పడమే కాకుండా గత కొన్ని సంవత్సరాలుగా మహమ్మారి కారణంగా తీవ్రంగా ప్రభావితమైన కళాకారులు , చేతివృత్తుల వారి జీవనోపాధికి సహాయపడటం అని అన్నారు. ఉత్సవం లో పాల్గొన్న కళాకారులకు, స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి, ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు శ్రీ కిషన్ రెడ్డి కృతజ్ఞతలను తెలియజేశారు.

ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోరాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవ్ (ఆర్ ఎస్ ఎం) నిర్వహించడానికి గౌరవ ప్ర ధాన మంత్రి నుండి తనకు లభించిన ప్రోత్సాహాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.విదేశీ వ్యవహారాలు , సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి శ్రీమతి మీనాక్షి లేఖి మాట్లాడుతూ, మహిళా సాధికారతకు మన వారసత్వంలో కాకతీయ వంశానికి చెందిన రాణి రుద్రమ దేవి వంటి స్ఫూర్తి ప్రదాతలు ఎందరో ఉన్నారని, మన గత వైభవం నుండి మనం ఎన్నో నేర్చుకోవాలని, సమాజంలోని అన్ని కోణాల్లో మహిళా నాయకులను తయారు చేసే దిశగా ముందుకు సాగాలని అన్నారు.మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి సిహెచ్ విద్యాసాగర్ రావు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ, 75 సంవత్సరాల స్వాతంత్ర్యం సందర్భంగా మనం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ను జరుపుకుంటున్నామని, ప్రపంచం ఇప్పుడు సాంస్కృతిక , ఆధ్యాత్మిక ప్రేరణ కోసం భారతదేశం వైపు చూస్తోందని అన్నారు.నేడు ముగింపు రోజున శ్రీ రామాచారి బృందం ప్రదర్శనలు, , పరంపర ఫౌండేషన్ వారి దేవాలయ నృత్య ప్రదర్శన-గుడి సంబరాలు, జయప్రభ మానన్ నృత్య రూపకం, ఇంకా అనేక జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పద్మశ్రీ డాక్టర్ ఎల్. సుబ్రమణ్యం , పద్మశ్రీ కవితా కృష్ణమూర్తితో సహా ప్రముఖ విద్వాంసుల సంగీతప్రదర్శనలు కూడా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.హైదరాబాద్ లో మూడు రోజుల పాటు జరిగిన ఈ మెగా ఫెస్టివల్ ను గౌరవ ఉప రాష్ట్రపతి

శ్రీ ఎం. వెంకయ్య నాయుడు ఏప్రిల్ 1న ఎన్టీఆర్ స్టేడియమ్ లో ప్రారంభించారు. క్రాఫ్ట్స్ అండ్ ఫుడ్ ఫెస్టివల్ ను తెలంగాణ గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందరరాజన్ ప్రారంభించారు. హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ ఏప్రిల్ 1న మహోత్సవ్ కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏప్రిల్ 2న తమిళనాడు గవర్నర్ శ్రీ ఆర్.ఎన్.రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి , కేంద్ర సాంస్కృతిక , పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్ వాల్ ఏప్రిల్ రెండవ తేదీ కార్యక్రమం లో పాల్గొన్నారు. ప్రముఖ సినీ నటుడు, కేంద్ర మాజీ మంత్రి శ్రీ కె.చిరంజీవి కూడా ఏప్రిల్ 2న కార్యక్రమం లో పాల్గొని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ చేస్తున్న కృషిని ప్రశంసించారు. తెలుగు రాష్ట్రాల్లో రాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక (ఫ్లాగ్ షిప్) కార్యక్రమం అయిన రాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవ్, ఏడు జోనల్ సాంస్కృతిక కేంద్రాల చురుకైన భాగస్వామ్యంతో 2015 నుండి నిర్వహించబడుతోంది. రాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవ్ ఈ 12వ ఎడిషన్ మన వారసత్వం యొక్క మూడు 'సి' లను - కల్చర్ (సంస్కృతి), క్రాఫ్ట్స్ (హస్తకళ) , కుయిజన్ (వంటకాలు) - ను ప్రదర్శించడం, బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించింది. భారతదేశ శక్తివంతమైన సాంస్కృతిక వైవిధ్యాన్ని ఆడిటోరియాలు , గ్యాలరీలకు పరిమితం చేయకుండా ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో ఆర్ఎస్ఎం కీలక పాత్ర పోషిస్తోంది. "ఏక్ భార త్- శ్రేష్ఠ భార త్" అనే లక్ష్యాన్ని సాధించడం కోసం ఒక రాష్ట్రానికి చెందిన జానపద, గిరిజన కళలు, నృత్యం, సంగీతం, వంటకాలు, సంస్కృతిని ఇతర రాష్ట్రాల్లో ప్రదర్శించడం లోను, అదే సమయంలో కళాకారులు, చేతి వృత్తుల వారి జీవనోపాధికి మద్దతు ఇచ్చేందుకు ఒక సమర్థవంతమైన వేదిక ను కల్పించడం లోను ఇది కీలక పాత్ర పోషించింది. ఢిల్లీ, వారణాసి, బెంగళూరు, తవాంగ్, గుజరాత్, కర్ణాటక, త్రిపుర, మధ్యప్రదేశ్ ,పశ్చిమ బెంగాల్ వంటి వివిధ రాష్ట్రాలు ,నగరాలలో నవంబర్, 2015 నుండి ఇప్పటి వరకు ఆర్ఎస్ఎమ్‌పదకొండు ఎడిషన్ లను నిర్వహించారు.

చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ ఇవ్వాలంటూ టీఎంసీ తీర్మానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే డిమాండ్ ఏనాటి నుంచో ఉంది. అయితే బిల్లు రూపం నుంచి చట్ట రూపం దాల్చడం లేదు. అప్పుడప్పుడు ఈ విషయమై రాజకీయ చర్చ జరుగుతుంది. కొద్ది రోజుల క్రితం మహిళా దినోత్సవం సందర్భంగా పార్లమెంట్‌లోనూ చర్చ జరిగింది. కానీ చర్చ చట్టాన్ని చేరడం లేదు. తాజాగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని మరోసారి లేవనెత్తింది. రాజ్యసభలో టీఎంసీ పక్ష నేత డెరెక్ ఓబ్రెయిన్.. సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ మహిళా రిజర్వేషన్ బిల్లుపై అధికార పార్టీ బీజేపీకి సవాల్ విసిరారు. ఇంటికి వచ్చిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీసోమవారం ఆయన వివిధ పార్టీల్లో ఉన్న మహిళా ఎంపీల జాబితాను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ బీజేపీకి నిబద్ధత ఉంటే మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏప్రిల్ 8కి ముందు తాము పార్లమెంట్‌లో నిబంధన 168 కింద ఒక తీర్మానాన్ని పెట్టబోతున్నామని, దానికి మద్దతు ఇవ్వాలని అన్నారు. నిబంధన 168 కింద ప్రజా ప్రయోజన విషయాలను ఎంపీలు లేవనెత్తవచ్చు. దాని ప్రకారమే టీఎంసీ ఈ తీర్మానాన్ని తీసుకురానుంది.

కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌కు సోనియా అపాయింట్‌మెంట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి హనుమంత రావు కు సోనియా గాంధీ అపాయింట్మెంట్ లభించింది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న వివిధ పరిణామాలను సోనియాకు వివరించేందుకు పలుమార్లు ఢిల్లీకి వెళ్లిన వి.హన్మంతరావుకు సోనియా అపాయింట్ లభించలేదు. తాజాగా ఆయనకు సోమవారం సాయంత్రం 5 గంటలకు సోనియా అపాయింట్ మెంట్ లభించింది. వీహెచ్ ప్రత్యేకంగా సోనియాతో భేటీ కానున్నారు. ఈ రోజు సాయంత్రం 5 గంటలకు రాహుల్ గాంధీ తో రాష్ట్ర నేతల సమావేశం వుంది. అదే సమయంలో వీహెచ్ కు సోనియాగాంధీ అపాయింట్ మెంట్ లభించింది. సోనియా తో భేటీ తర్వాత... రాహుల్ గాంధీ తో సమావేశమవుతానని వీహెచ్ తెలిపారు.

2047 నాటికి అగ్రస్థానానికి భారత్ : తమిళనాడు గవర్నరు శ్రీ ఆర్.ఎన్.రవి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:భారతదేశం అన్నిరంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతోందని, 2047 నాటికి ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుకోబోతోందని తమిళనాడు గవర్నరు శ్రీ ఆర్.ఎన్.రవి పేర్కొన్నారు. దక్షిణాధి ప్రాంత సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులుగా ఉన్న ఆయన హైదరాబాద్ ఎన్‌టీఆర్ స్టేడియంలో రెండురోజులుగా కొనసాగుతున్న జాతీయ సంస్కృతి మహోత్సవాలకు రెండోరోజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖల మంత్రి శ్రీ జి.కిషన్‌రెడ్డి, కేంద్ర సాంస్కృతిక, పార్లమెంట వ్యవహారాల శాఖల సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘవాల్ తో కలిసి హాజరైన తమిళనాడు గవర్నరు మాట్లాడుతూ ప్రస్తుతం 75 ఏళ్ల స్వాతంత్ర అమృత మహోత్సవాలు జరుపుకుంటున్న భారతదేశం రాబోయే 25 ఏళ్లలో ఆర్థికంగానేగాక సైనిక, మేధ పరమైన, ఆధ్యాత్మిక రంగాలలో ప్రపంచ దేశాలకు నాయకత్వం వహించనుందని చెప్పారు. రాబోయే 25 ఏళ్ల కాలాన్ని ఆయన 'అమృత్ కాల్' గా అభివర్ణించారు. ప్రస్తుత భారతదేశ అభివృద్ధిని ప్రపంచదేశాలు ఎంతో గౌరవభావంతో చూస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ప్రభుత్వ సమ్మిళిత అభివృద్ధి పథకాలు దేశంలో చిట్టచివరి పౌరులందరికీ చేరుతున్నాయని తమిళనాడు గవర్నరు పేర్కొన్నారు. నగదు బదిలీ ద్వారా సామాన్యులందరికీ ప్రభుత్వ పథకాలు నేరుగా అందించడానికి 450 మిలియన్ల ప్రధానమంత్రి జన్ ధన్ యోజన జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలు మార్గం వేశాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 65 ఏళ్లు నిండినా పదేళ్ల క్రితం వరకు భారతదేశం పేదరికం, నిరక్షరాస్యత, రోగాలకు నిలయంగా ఉండేదని, కానీ 2014 తర్వాత ప్రభుత్వం చేపట్టిన వినూత్న పథకాలు ఆరోగ్యవంతమైన సమాజానికి బాటలు వేశాయన్నారు. అందరికీ సరైన ఆహారం, నివాసం, విద్య, ఆరోగ్యం, రక్షిత తాగునీరుతోపాటు విద్యుత్ సౌకర్యాలు అందించడంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమయ్యిందని, దేశం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని విశ్లేషించారు. 2014 కంటే ముందు దేశంలో కేవలం 400 స్టార్టప్ కంపెనీలు ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య పదివేలకు పైగా పెరిగాయని చెప్పారు.

అతి పురాత, ఉన్నతమైన భారతీయ సంస్కృతి బ్రిటీష్ వలస పాలన కాలంలో ఒక పద్ధతి ప్రకారం ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు భారతదేశం బలమైన ఆర్థిక, మేధోపరమైన, సుసంపన్న సంస్కృతి, గొప్ప ఆధ్యాత్మికత అనే నాలుగు స్తంభాలపై ఆధారపడి ఏక్ భారత్ గా నిలిచిందని

కొండపల్లి మాధవ్‌కు ఉగాది పురస్కారం

హైదరాబాద్, ఏప్రిల్ 4:సత్యసంగీత ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఓంకార్ రాజు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉగాది పురస్కారాల్లో భాగంగా టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొండపల్లి మాధవ్‌కు ఉగాది పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ముషీరాబాద్ నియోజక వర్గంలో అందిస్తున్న సామాజిక సేవలకు గానూ ఈ గుర్తింపు లభించిందన్నారు.

శ్రీ నూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానం

హైదరాబాద్, ఏప్రిల్ 4శ్రీ నూతన గౌడసంఘం ఆధ్యక్షుడు డాక్టర్ పటేల్ వెంకటేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది పురస్కారాల ప్రదానం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బండ్లగూడ మేయర్ బి. మహేందర్‌గౌడ్, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, దమ్మయిగూడ చైర్మన్ వశుమతి ప్రణతిగౌడ్, జవహర్‌నగర్ కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, బోడుప్పల్ కార్పొరేటర్ విద్య హాజరయ్యారు.

అనంతరం ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నూతన గౌడ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాచర్ల మొగిలిగౌడ్, వర్కింగ్‌ప్రెసిడెంట్ మోరిగాడి ఉపేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు తాండ సూర్యనారాయణగౌడ్, కట్కూరి శ్రీనివాస్‌గౌడ్, కనుకరాజ్ గౌడ్, చందర్‌గౌడ్ ఇతర సంఘాల రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వీరస్వామిగౌడ్, నర్సాగౌడ్, సిద్ది రాములుగౌడ్, బండి సాయన్నగౌడ్, ఏడుకొండలుగౌడ్, వంగ రాములుగౌడ్ ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనకపోతే కొట్లాడుడే: కేంద్రానికి పువ్వాడ హెచ్చరిక

ఖమ్మం, ఏప్రిల్ 4:రాష్ట్రంలో పండిన ధాన్యం కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే కొట్లాట తప్పదని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కేంద్రాన్ని హెచ్చరించారు. అన్నదాతల జీవన్మరణ సమస్యగా మారిన ధాన్యం కొనుగోలుకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మరో ఉద్యమానికి పూనుకున్నారని తెలిపారు. సోమవారం ఖమ్మం నియోజకవర్గంలోని మంచుకొండ గ్రామంలో జరిగిన రైతు నిరసన దీక్షలో మంత్రి పాల్గొన్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనం కోసం ఢిల్లీపై సీఎం కేసీఆర్ దండయాత్ర చేసేందుకు సిద్ధమయ్యారని మంత్రి అన్నారు. నాడు ఉద్యమనేతగా సమైక్య రాష్ట్రంలో కర్షకుల ఆత్మహత్యలను కండ్లారా చూసి చలించిపోయిన కేసీఆర్.. నేడు ఆ దుస్థితి నుంచి బయట పడేసేందుకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్మించడమే కాదు, రైతు బంధు, రైతు బీమా, 24గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ ఎన్నో పథకాలతో ఏడేళ్ల కాలంలోనే తెలంగాణను దేశానికే అన్నం పెట్టే స్థితికి తీసుకొచ్చారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. బీజేపీ నాయకులు తలా తోకా లేకుండా మాట్లాడుతుండగా, కేంద్రం రోజుకో కొర్రీ పెడుతూ ప్రస్తుత యాసంగి వడ్ల కొనుగోలుపై దాటవేస్తూ వివక్ష చూపుతున్నదని మండిపడ్డారు. దీనిపై తాడోపేడో తేల్చకపోతే అన్నదాతలు మరింత నష్టపోయే ప్రమాదమున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న పోరుబాటకు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు సీఎం వెంట ఉంటారని మంత్రి స్పష్టం చేశారు.

చీపురుపల్లిలో రెవెన్యూ డివిజన్‌ను ప్రారంభించిన మంత్రి బొత్స

విజయనగరం, ఏప్రిల్ 4: విజయనగరం జిల్లా చీపురుపల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాజాం శాసన సభ్యుడు కంబాల జోగులు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ ఏ.శ్రీమతి సూర్యకుమారి, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభంజనంలా షర్మిల పాదయాత్ర.. విశేషంగా ఆదరిస్తున్న ప్రజలు

అమరావతి, ఏప్రిల్ 4:వైయస్సార్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వైయస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్ర సోమవారం ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ నేపథ్యంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వైయస్ షర్మిలకు ఘనంగా స్వాగతం పలికి.. రాజన్న కూతురు అంటూ ఆప్యాయత అనురాగాలను ప్రదర్శించారు. సూర్యాపేట జిల్లా నుండి ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం పరిధిలోని తిరుమలాయపాలెం మండలంలోకి షర్మిల పాదయాత్ర ప్రవేశించింది. కాకరవాయి బ్రిడ్జి దగ్గర భారీ స్థాయిలో ప్రజలు తరలిరావడంతో ఆ ప్రాంతం అంతా జనసంద్రంగా మారింది. ప్రజలను కలుస్తూ అభివాదం చేస్తూ షర్మిల తనదైన శైలిలో పాదయాత్రతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ఉగాది పురస్కరించుకొని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన టీఆర్ఎస్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు.

శుభకృత్ నామ సంవత్సరం ఉగాది వేడుకలు శనివారం ముషీరాబాద్ అంబర్‌పేట నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. రెండు నియోజకవర్గంలోని ఆలయాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఉగాది పచ్చడి, బొబ్బట్లు పంపిణీ చేశారు.

ఈ వేడుకల్లో పూరియాణ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు కే.రవిచారి, సునీతాప్రకాష్‌గౌడ్, సుప్రియానవీన్‌గౌడ్, పావని వినయ్‌కుమార్, జి. రచనశ్రీ, బి. పద్మావెంకటరెడ్డి, వై. అమృత, కన్నె ఉమాదేవి, దూసరి లావణ్యగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను టీఆర్ఎస్ నగర సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు ప్రగతిభవన్‌లో కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ మీడియాకు చెందిన ఆరోగ్య విలేకరుల అవగాహన కోసం పూణేలోని ఎం.ఐ.వి.కి "విజ్ఞాన భాగస్వామ్య పర్యటన"

హైదరాబాద్, ఏప్రిల్ 4:ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, పత్రికా సమాచార కార్యాలయం, ఐ.సి.ఎం.ఆర్. సంయుక్తంగా ఆరోగ్య విలేకరుల అవగాహన కోసం "ప్రెస్ టూర్" నిర్వహించాయి. మన శాస్త్రీయ సమాజల విజయాలు, కొత్త టీకాను ముఖ్యంగా మన దేశీయ "కోవాక్సిన్" ను అభివృద్ధి చేసే శాస్త్రీయ ప్రక్రియ, సవాళు , అవకాశాలను అర్థం చేసుకోవాలనేది ఈ "ప్రెస్ టూర్" యొక్క ఉద్దేశ్యం.

దేశ రాజధాని నుంచి సందర్శనకు వచ్చిన మీడియా సిబ్బందికి, నగరంలోని జాతీయ పౌష్టికాహార సంస్థ లో ఈ రోజు విజ్ఞాన భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. జ్ఞానాన్ని పంచుకుని, సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలనే లక్ష్యంతో, మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేసిన, ఈ కార్యక్రమంలో దేశ అభివృద్ధి కోసం ఐ.సి.ఎం.ఆర్. - జాతీయ పౌష్టికాహార సంస్థ చేపట్టిన అత్యాధునిక పరిశోధనలను ప్రదర్శించారు.

ఆహూతుల నుద్దేశించి ఎన్.ఐ.ఎన్., డైరెక్టర్, డాక్టర్ హేమలత ప్రసంగిస్తూ, శారీరక లోపాలను తగ్గించడానికి ఐరన్, అయోడిన్ తో కూడిన డబుల్ ఫోర్టిఫైడ్ ఉప్పును ప్రవేశపెట్టడం వంటి వివిధ విధాన కార్యక్రమాల్లో తమ సంస్థ నిర్వహించిన పోషకాహార అధ్యయనాలు ప్రభుత్వానికి సహాయపడ్డాయని తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఐ.సి.డి.ఎస్., ఎం.డి.ఎం., ఎస్.ఏ.ఎం. వంటి వివిధ పోషకాహార కార్యక్రమాలను ఎన్.ఐ.ఎన్. ప్రధానంగా నిర్ధారిస్తూ ఉంటుందని ఆమె వివరించారు. ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ. కి సలహాదారుగా, ఎన్.ఐ.ఎన్. వివిధ విటమిన్లు, ఖనిజాలు, స్థూల పోషకాలకు సంబంధించిన సమాచారం తో కూడిన ఆర్.డి.ఏ. (అవసరమైన ఆహార రోజువారీ అలవెన్స్) వివరాలను అందిస్తుంది.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి మీడియా సిబ్బంది కృషి చేయాలనీ, వారికి సులభంగా అర్థమయ్యే భాషలో శాస్త్ర విజ్ఞానాన్ని అందించాలనీ, ఆమె పిలుపునిచ్చారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ఆకలి చావులు లేకుండా చేయాలనే లక్ష్యాన్ని సాధించడం లో మీడియా చాలా ముఖ్యమైన పాత్ర పోషించవలసిన అవసరం ఉందని డైరెక్టర్ పేర్కొంటూ, కోవిడ్ -19 మహమ్మారి సమయంలో మీడియా పోషించిన బాధ్యతాయుతమైన పాత్రను ప్రశంసించారు. "కోవిడ్-19 మహమ్మారి సమయంలో, ఎన్.ఐ.ఎన్. శాస్త్రవేత్తలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్వహించిన సెరో-సర్వేలు ఖచ్చితమైన విధాన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడ్డాయి. వాటిని మీడియా తగిన విధంగా ప్రజలకు తెలియజేసింది.", అని ఆమె పేర్కొన్నారు.

ప్రాంగణం లోని ఫుడ్ కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, టాక్సికాలజీ, స్పోర్ట్స్ న్యూట్రిషన్ ల్యాబ్ ల వంటి వివిధ ప్రయోగశాలలకు ఈ ఆరోగ్య విలేకరులను తీసుకువెళ్ళారు.

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, పి.ఐ.బి., డిప్యూటీ డైరెక్టర్, శ్రీ అంకుర్ లాహోటీ, ఐ.ఐ.ఎస్. ఈ సదస్సులో ప్రసంగిస్తూ, పర్యటన వివరాలు తెలియజేశారు, విజ్ఞాన భాగస్వామ్య సందర్శనను అమలు చేసినందుకు ఎన్.ఐ.ఎన్., డైరెక్టర్ కు ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాద్ లోని పి.ఐ.బి., డిప్యూటీ డైరెక్టర్, డాక్టర్ మానస్ కృష్ణకాంత్ కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో విభాగాధిపతులందరూ హాజరై తమ తమ రంగాల్లో అత్యాధునిక పరిశోధనల గురించి వివరించారు. సదస్సును డాక్టర్ లక్ష్మయ్య సమన్వయ కర్తగా వ్యవహరించగా, డాక్టర్ సుబ్బారావు వందన సమర్పణ చేశారు.

అరుదైన ఆరు రసాయన రిఫరెన్స్ మెటీరియల్‌లను ఆవిష్కరించిన శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:యాంటీ డోపింగ్ పరీక్షల నిర్వహణ రంగంలో నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ (ఎన్ డి టి ఎల్) పెద్ద ముందడుగు వేసింది. యాంటీ డోపింగ్ పరీక్షల నిర్వహణలో వినియోగించే పదార్థాలలో ఆరు అరుదైన రసాయన పదార్థాలను (రిఫరెన్స్ మెటీరియల్స్) (ఆర్ఎం) స్వదేశీ పరిజ్ఞానంతో దేశీయంగా సంస్థ అభివృద్ధి చేసింది.డోపింగ్ పరీక్షలను నిర్వహించేందుకు ప్రపంచవ్యాప్తంగా వాడా గుర్తింపు పొందిన పరిశోధనా సంస్థలు స్వచ్ఛమైన ఈ రసాయనాలను వినియోగిస్తున్నాయి. ఈ ఆరు అత్యంత అరుదైన రసాయన పదార్థాలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నిపెర్)-గౌహతి మరియు సిఎస్ ఐ ఆర్ -ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్ (ఐఐఎం), జమ్మూ సహకారంతో నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ ఒక సంవత్సరం కంటే తక్కువ కాలంలో అభివృద్ధి చేసింది.

నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ పాలకమండలి 15వ వార్షిక సమావేశంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ ఈ ఆరు ఆర్ఎంలను విడుదల చేశారు. కార్యక్రమంలో క్రీడల శాఖ కార్యదర్శి శ్రీమతి సుజాత చతుర్వేది క్రీడల మంత్రిత్వ శాఖ సీనియర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్ఎం లను కొన్ని పరిశోధనాశాలలు మాత్రమే అభివృద్ధి చేయగలిగాయి. ఆర్ ఏం లను అభివృద్ధి చేసిన సంస్థల జాబితాలో ఇప్పుడు దేశానికి చెందిన నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ స్థానం సంపాదించింది. రిఫరెన్స్ మెటీరియల్స్ ను అభివృద్ధి చేసిన సంస్థలను శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ అభినందించారు. నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ అభివృద్ధి చేసిన రిఫరెన్స్ మెటీరియల్స్ ప్రపంచంలో పూర్తి అందుబాటులో లేవని మంత్రి అన్నారు అయితే,యాంటీ డోపింగ్ పరీక్షణ నిర్వహణకు వాడా గుర్తింపు పొందిన అన్ని పరిశోధన సంస్థలకు వీటి అవసరం ఉంటుందని మంత్రి వివరించారు. ప్రస్తుతం భారతదేశం వీటిని కెనడా, ఆస్ట్రేలియా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదని మంత్రి పేర్కొన్నారు. ఆరు పదార్థాలను స్వదేశంలో అభివృద్ధి చేసి శాస్త్రీయ రంగంలో భారతదేశం పెద్ద అడుగు ముందుకు వేసిందని మంత్రి అన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ నిర్మాణం జరగాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును సాకారం చేసే దిశలో ఈ పదార్థాల అభివృద్ధి జరిగిందని అన్నారు. త్వరలో వీటిని ఇతర దేశాలకు ఆరు ఆర్ఎంల ఎగుమతి ప్రారంభమవుతుందని మంత్రి అన్నారు.

అత్యంత అరుదైన రసాయన పదార్థాలు అందుబాటులోకి రావడంతో క్రీడా రంగంలో నిషేదిత పదార్థాలను వినియోగించకుండా చూసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు మరింత పటిష్టంగా అమలు జరుగుతాయని శ్రీ ఠాకూర్ అన్నారు. క్రీడల రంగంలో వివిధ దేశాల మధ్య స్నేహ సంబంధాలు బలపడే దిశగా రిఫరెన్స్ మెటీరియల్స్ దోహద పడతాయని అన్నారు.

రిఫరెన్స్ మెటీరియల్స్ అభివృద్ధి చేసేందుకు రెండు జాతీయ శాస్త్రీయ సంస్థలతో గత ఏడాది నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 20 రిఫరెన్స్ మెటీరియల్స్ ను దేశంలో అభివృద్ధి చేసి ఉత్పత్తి చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించి 2-3 సంవత్సరాల లోగా వీటిని స్వదేశీ పరిజ్ఞానంతో దేశీయంగా ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. దశలవారీగా నిషేధిత పదార్థాలకు సంబంధించిన 20 రిఫరెన్స్ మెటీరియల్‌లను అభివృద్ధి చేయాలని మూడు సంస్థలు నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారం నిధులతో ఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

సిఎస్ ఐ ఆర్ -ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్ , ఐఐఎం జమ్మూ సహకారంతో అభివృద్ధి చేసిన ఆరు రిఫరెన్స్ పదార్థాలను మంత్రి ప్రారంభించారు. అంతకుముందు నిపీర్ గౌహతి తో కలిసి నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ 2021లో రెండు రిఫరెన్స్ మెటీరియల్ ను అభివృద్ధి చేసింది. ఈ రెండు రిఫరెన్స్ పదార్థాలను వాడా గుర్తింపు పొందిన ఇతర పరిశోధన సంస్థలకు భారతదేశం అందించింది.

ఈ రిఫరెన్స్ మెటీరియల్స్‌ను ప్రారంభించడం వల్ల దేశంలో డోపింగ్ నిరోధక కార్యక్రమాలను ప్రోత్సహించడం మరియు సమర్థవంతంగా అమలు చేసేందుకు అవకాశం కలుగుతుంది. మచ్చ లేకుండా క్రీడా కార్యకలాపాల నిర్వహణ కోసం క్రీడా మంత్రిత్వ శాఖ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా మెరుగైన యాంటీ-డోపింగ్ పరీక్షలను నిర్వహించేందుకు వీలవుతుంది.

యాసంగి ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయాల్సిందే: ఎర్రబెల్లి

జనగామ, ఏప్రిల్ 4:: తెలంగాణ రైతులు పండించిన యాసంగి ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని కేంద్రం చెప్పడం సిగ్గుచేటని పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

కేంద్ర వైఖరిని నిరసిస్తూ, టీఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ల పిలుపు మేరకు చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. వరసగా నియోకవర్గం లోని రాయపర్తి, తొర్రూరు, పెద్ద వంగర, కొడకండ్ల, దేవరుప్పుల మండల కేంద్రాల్లో రైతులు, ప్రజల భాగస్వామ్యంతో పార్టీ ప్రజా ప్రతినిధులు, శ్రేణులు నిర్వహించిన ధర్నా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు.ఎడ్ల బండ్లు ఎక్కి, తలపాగా చుట్టి, చర్లకోల చేతబట్టి, రైతాంగం వెంట తరలి రాగా, మంత్రి రైతులా రైతులతో కలిసి పోయారు.అలాగే భారీ ఎత్తున జరిగిన ఈ ధర్నా కార్యక్రమాల్లో మంత్రి కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, నినాదాలు చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

తెలంగాణ ధాన్యం మొత్తం కొనాల్సిందే: ఎమ్మెల్యే రెడ్యా నాయక్

వరంగల్, ఏప్రిల్ 4:తెలంగాణవ్యాప్తంగా కోటి ఎకరాలను సాగులోకి తెచ్చి రైతన్నలకు అండగా నిలిచినా? నేడు కేంద్ర ప్రభుత్వ తీరుతో రైతన్నలు మళ్ళీ రోడ్డెకాల్సిన పరిస్థితి ఏర్పడిందని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. తెలంగాణలో యాసంగి పంట మొత్తం కొనేదాక నిరసన విరమించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సోమవారం కేటీఆర్ పిలుపు మేరకు మరిపెడ మండల కేంద్రంలో చేస్తున్న రైతు నిరసన దీక్షకు హాజరై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నదాతల సంక్షేమాన్ని విస్మరిస్తే వచ్చే ఎన్నికల్లో బీజేపికి పతనం తప్పదని హెచ్చరించారు. ఎన్నికలు వస్తే రైతుల ఓట్లతో గద్దెనెక్కి, అనంతరం వారి బాగోగులు పట్టించకోకపోవడం అప్రజాస్వామికం మండిపడ్డారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మాదిరి తెలంగాణలో కూడా ధాన్యం కొనలని డిమాండ్ చేశారు.

కాగా, ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గుడిపూడి నవీన్ రావు, డోర్నకల్ యువనేత రవిచంద్ర, ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబు, మునిసిపల్ చైర్మెన్ గుగులోత్ సింధూర రవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంపై టీఆర్ఎస్ సమరభేరీ

సూర్యాపేట, ఏప్రిల్ 4:ఆహార భద్రత చట్టం ప్రకారం దేశంలో పండిన ప్రతీ వరి గింజను కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు చేసేదాక మోదీ ప్రభుత్వాన్ని వదిలేదని లేదని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు వరి ధాన్యం కొనుగోలు చేయాలంటూ సూర్యాపేట నియోజకవర్గ కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన దీక్షలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రం వైఖరి తెలిసే వరి సాగు చేయొద్దని సీఎం కేసీఆర్ ముందే రైతులకు సూచించారన్నారు. వరి వేయాలని బీజేపీ నేతలు రైతులను రెచ్చగొట్టారన్నారు. వరి కొనిపిస్తామన్న బీజేపీ నేతలు.. ఇప్పుడు కనిపించడం లేదని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్ లను నియంత్రించే అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందన్న మంత్రి.. రాష్ట్రాలలో పండిన పంటలను ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రాంతాలకు తరలించే హక్కు కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తిరోగమన విధానాల వల్ల దేశంలో ఆకలి కేకల సూచీ అధ్వాన్నంగా క్రింది స్థాయి కి పడిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం వల్లే సోమాలియా తరహా ఆకలి కేకలు దేశంలో తప్పినాయన్నారు. ఓ వైపు బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా, పార్టీగా రైతులకు వరి విషయంలో తాము చెప్పే ప్రయత్నం చేస్తే, వరి వేయాలని ధాన్యం కొంటా మని, దుష్ట రాజకీయాలకు బిజెపి పాల్పడింది అని మంత్రి మండిపడ్డారు. మోసపూరితంగా కేంద్రంలో ఒకలా రాష్ట్రంలో ఒకలా ప్రవర్తిస్తున్న బిజెపి దుర్మార్గపు రాజకీయాలకు చరమగీతం పాడాలని మంత్రి జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు.

కేంద్రం తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోంది: మంత్రి

సూర్యాపేట, ఏప్రిల్ 4:: తెలంగాణాను ఆదర్శంగా చూపాల్సిన కేంద్రం తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని మంత్రి జగదీష్ రెడ్డి విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... సాంప్రదాయ పంటలను వదిలేసి ఆహార భద్రత కోసం ప్రభుత్వాలు చెప్పినందుకు రైతులు వరి పంటకు అలవాటు పడ్డారని తెలిపారు. రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకుంటుందన్నారు. కేంద్ర సహకారం లేకపోతే రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు 100 శాతం న్యాయం చేయలేవని తెలిపారు. పంజాబ్‌లో 100 శాతం కొంటున్న కేంద్రం ఇక్కడ మాత్రం వివక్ష చూపుతుందని మంత్రి మండిపడ్డారు. కేంద్రం ఎటువంటి సహాయం చేయకున్నా రైతులకు సమృద్ధిగా నీరు అందించామని తెలిపారు. దేశంలోనే ఎక్కువ వ్యవసాయ ఉత్పత్తులు సాదించిన రాష్ట్రంగా తెలంగాణాను మొదటి స్థానంలో నిలిపామన్నారు. కోతల దశలో ఉన్న సమయంలో మెడ మీద కత్తి పెట్టి బాయిల్డ్ రైస్ ఇవ్వమని సంతకాలు పెట్టించుకున్నారని ఆగ్రహించారు. వరి వెయ్యొద్దని చెప్పినా ప్రతిపక్ష బీజేపీ నాయకులు రైతులను మోసం చేసేలా వరి వేయమని ప్రోత్సహించి మోసం చేశారని మంత్రి జగదీష్ రెడ్డి దుయ్యబట్టారు.

టీఆర్ఎస్ ధర్నాలో ప్రజా గాయకుడు గద్దర్

హైదరాబాద్, ఏప్రిల్ 4:వడ్లను కేంద్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేస్తున్న విషయం విదితమే. అయితే మేడ్చల్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ధర్నాలో ప్రజా గాయకుడు గద్దర్ పాల్గొన్నారు. అల్వాల్ మండల తహశీల్దార్ కార్యాలయం ముందు కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందంటూ నిరసన చేపట్టారు. కేంద్రమే వడ్లన్నీ కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక టీఆర్ఎస్ ఎమ్మెల్యే మైసంపల్లి హనుమంతారావు ఆధ్వర్యంలో ధర్నాను చేశారు. రైతులు పండించిన వడ్లను మద్దతు ధరకు కేంద్రం కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. రైతుల కోసమే తాను ఈ ధర్నాలో పాల్గొన్నానని గద్దర్ తెలిపారు.

కేంద్రం యసంగి వరి ధాన్యం కొనలని సంగారెడ్డి జిల్లాలో తెరాసా నాయకుల నిరసన దీక్ష..!

సంగారెడ్డి ఏప్రిల్ 4 (నేటి నిజం ప్రతినిధి) యాసంగి లో రైతులు పండించిన వరి ధాన్యం కేంద్రం వెంటనే కొనుగోలు చేయాలని టిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీ చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మున్సిపల్ తో పాటు సదాశివపేట మండల్ కంది, కొండాపూర్ మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది సంగారెడ్డి జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీ చింతా ప్రభాకర్ తో పాటు చైర్పర్సన్ బొంగుల విజయలక్ష్మి , డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం , మున్సిపల్ వైస్ చైర్మన్ లతా విజేందర్ రెడ్డి గ, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి , సి డి సి మాజీ చైర్మన్ ప్రభు గౌడ్ , సంగారెడ్డి జడ్పిటిసి మనోహర్ గౌడ్ ,

జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి ..!!

మెదక్, ఏప్రిల్ 4 (నేటి నిజం ప్రతినిధి)జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, పంచాయతీ వార్డులు, పంచాయతీలకు, ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపాలిటీల్లో వార్డుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పంచాయతీ వార్డులు, పంచాయతీలు, మున్సిపాలిటీలో వార్డులు, ఎంపీటీసీ జెడ్పీటీసీ స్థానాల ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో కమిషనర్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరిలో రూపొందించిన ఓటరు జాబితా నుంచి ఖాళీగా ఉన్న స్థానాలకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితా త్వరితగతిన రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తుది ఓటర్ల జాబితా పై సమావేశం నిర్వహించాలన్నారు. ముసాయిదా ఓటరు జాబితా, స్థానిక పంచాయతీలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించాలని ,వాటిపై ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాల పరిశీలించి పరిష్కరిచాలని అలాగే నూతన ఓటర్ల నమోదు దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

ఏప్రిల్ 21 నాటికి తుది ఓటరు జాబితాను వార్డుల వారీగా తయారు చేసి నోటిఫైచేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఆయన ఆదేశించారు. ఏప్రిల్ 23 నాటికి ఎంపిటిసి స్థానాలకు, జడ్పిటిసి స్థానాలకు సంబంధించి తుది ఓటరు జాబితా విడుదల చేసి ఖాళీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయడానికి సిద్ధంగా ఉండాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలు గుర్తించాలని ఆయన సూచించారు. బ్యాలెట్ బాక్సులు, ఇంక్ బాటిళ్లు మొదలైన ఎన్నికల సామాగ్రి సంసిద్ధం చేసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో అవసరమైన ఎన్నికల సామాగ్రి అందుబాటులో లేని పక్షంలో పక్కన జిల్లా నుంచి తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో ఓటర్ల తుది జాబితాను ప్రభుత్వ కార్యాలయాల్లో, పంచాయతీ ఆఫీసులలో, జిల్లా వెబ్సైట్లో పొందుపరచాలని సూచించారు. గ్రామ పంచాయతీ వార్డుల్లో ఓటర్ల జాబితా తయారు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఒక వార్డులో ఓటరు మరో వార్డులో ఉండకుండా జాగ్రత్త వహించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణను చాలా పకడ్బందీగా తీసుకోవాలని అలసత్వం వహించడవద్దని ఆయన పేర్కొన్నారు.

జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం బ్యాలెట్ పేపర్ ముద్రించడానికి అనువైన ప్రింటింగ్ కేంద్రాలను గుర్తించాలని ఆయన సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ సిబ్బంది గుర్తించాలని ఆయన సూచించారు. ఎన్నికల బుక్లెట్ లను రిటర్నింగ్ అధికారులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కౌంటింగ్ కేంద్రాలను ముందస్తుగానే ఎంపిక చేసుకోవాలని, ఎన్నికలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు టి-పోల్ లో నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఒక జెడ్.పి టి.సి. 5 ఏం.పి .టి.సి.లు , 6 సర్పంచు, 73 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయని, మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి వార్డు సభ్యులు ఖాళీలేవని ఎన్నికల కమిషనర్ కు తెలిపారు. ఈ సంవత్సరం జనవరి 5 న వెలువరించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం ఈ నెల 8 న ఓటర్ల జాబితా ప్రక్రియను మొదలు పెట్టి అభ్యంతరాలు స్వీకరించి , పరిష్కరించి 21 న తుది జాబితా విడుదల చేయుటకు అన్నీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పరిషత్ సీఈఓ వెంకట శైలేష్, , డీపీవో తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జిల్లా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

అమరావతి, ఏప్రిల్ 4:జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పాటైన సత్యసాయి జిల్లా కలెక్టర్ గా బసంత్ కుమార్ బాధ్యతల స్వీకరించారు. సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా పాలనా వికేంద్రీకరణ చేస్తూ 13 కొత్త జిల్లాలను సీఎం జగన్ నేడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తిలోని కలెక్టరేట్లోని కార్యాలయంలో మంత్రి శంకర్ నారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ,సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధి రత్నాకర్ జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, ఎస్పి, రాహుల్ దేవ్ సింగ్ జాయింట్ కలెక్టర్, దినేష్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ నవీన్, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో ఖాళీ అయిన ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి సంసిద్ధంగా ఉండాలి

సంగారెడ్డి, ఏప్రిల్ 04 (నేటి నిజం ప్రతినిధి) స్థానిక సంస్థల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, జెడ్పీ సీఈఓ లు, డీపీఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో ఆయా జిల్లాలలో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్ , సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్లు,కార్పొరేటర్ల స్థానాలకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఎన్నికల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.

ఖాళీగా ఉన్న స్థానాలకు సంబంధించి జనవరిలో రూపొందించిన ఓటరు జాబితా నుంచి ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాను ఈ నెల 8న ఆయా మున్సిపాలిటీ వార్డులు,గ్రామ పంచాయతీ వార్డులలో ప్రదర్చించాలని అధికారులకు సూచించారు.

జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏప్రిల్12 న సమావేశం నిర్వహించాలని కలెక్టర్లకు ఆయన సూచించారు. ముసాయిదా ఓటరు జాబితా పై ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, వాటిని ఏప్రిల్,19 వరకు పరిష్కరించాలని పేర్కొన్నారు.

ఏప్రిల్ 21 నాటికి తుది ఓటరు జాబితాను వార్డుల వారీగా తయారు చేసి నోటిఫైచేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు సూచించారు. మార్పులు, చేర్పులకు సంబంధించిన అభ్యర్థనలను ఓటరు జాబితాలో చేర్చే అధికారం కేవలం జిల్లా ఎన్నికల అధికారి/ జిల్లా కలెక్టర్ కు మాత్రమే ఉంటుందన్నారు. ఆయా జిల్లాలలోని ఖాళీ స్థానాల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలు గుర్తించాలని కలెక్టర్లకు ఆయన సూచించారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి సంసిద్ధం చేసుకోవాలన్నారు

ఎక్కడైనా న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్న స్థానాలకు నోటిఫికేషన్ఇవ్వరాదన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ, జిల్లాలో 91 వార్డు మెంబర్ స్థానాలు, 11 సర్పంచ్ స్థానాలు, రెండు ఎంపిటిసి స్థానాలు, సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 17 వ వార్డు స్థానం, బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు ఖాళీగా ఉన్నాయని ఎన్నికల కమిషనర్ కు తెలిపారు.

ఫోటో ఓటరు జాబితాలు సిద్ధంగా ఉన్నాయని, పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఎలాంటి కోర్టు కేసులు లేవని, ఖాళీ స్థానాల ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలుగా సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డిపిఓ సురేష్ మోహన్, డి ఎల్ పి ఓ సతీష్ రెడ్డి, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు - పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ,విద్యుత్ ఆర్టీసీ ఛార్జీలు తక్షణమే తగ్గించాలి

-వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి):కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు, పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ విద్యుత్, ఆర్టీసీ రవాణా చార్జీల తక్షణమే తగ్గించాలని మరియు వడ్ల లు కొనుగోలు చేయాలంటూ కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు టి పి.సి.సి పిలుపు ఆదేశాల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికధరలు, పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వేములవాడ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని వారన్నారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో టిఆర్ఎస్ అధికార ఉన్న పార్టీలే రోడ్లమీద ధర్నాలు చేయడం సిగ్గుచేటని వారన్నారు. ధర్నాల నాటకం ఇబ్బంది చేయాలని వారు డిమాండ్ చేశారు. సామాన్యుడు బతకలేని స్థితి చేస్తున్నటువంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తగిన రీతిలో ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి పేద వాడిని ఆదుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే అని గుర్తు చేశారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇచ్చి ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులు ప్రతి పేద వాడిని ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ఇప్పుడు ఉన్నటువంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ రకంగా కూడా ఆదుకోవడం లేదని ప్రజలను చాలా ఇబ్బందికి గురి చేస్తున్నారని వారన్నారు, రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాధించలేదని వారు గుర్తు చేశారు. పెంచిన టువంటి పెట్రోల్, డీజిల్, గ్యాస్ మరియు కరెంట్ చార్జర్ వెంటనే తగ్గించాలని లేనియెడల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన ఉండి పోరాడుతామని వారు అన్నారు. రానున్నది కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలుక రమేష్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేష్, పాత సత్య లక్ష్మి, కూరగాయల కొమురయ్య, చికోటి శ్రీహరి, వస్తాది కృష్ణ గౌడ్, తూము మధు, నాగుల రాము గౌడ్, తోట లహరి, రామ్ గోపాల్ రావు, నాగుల విష్ణు, దురిశెట్టి అరుణ్ తేజ చారి, సాయిని అంజయ్య, అయ్యోరుపల్లి మల్లేశం, నాగుల మహేష్, ఘంటల ప్రకాష్, ఖమ్మం గణేష్, పల్లెపు రాజేందర్, తంగెళ్ల గణేష్, సాబీర్, మర్రి పెల్లి రాజు, వనపర్తి శంకర్, మండే రాజు, లింగం యాదవ్,గడ్డం రేణుక, తిరుపతి, తదితరులు ఉన్నారు.

టిఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ధర్నా చేయాల్సింది గల్లీలో కాదు.. ప్రధాని ఇంటి ముందు..పార్లమెంట్‌లో.. బిజెపి..టిఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడండి..

కరీంనగర్ , ఏప్రిల్ 4: (నేటినిజం ప్రతినిధి): ధరలను పెంచుతూ బిజెపి, కరెంట్ బిల్లులు పెంచుతూ టిఆర్ఎస్, వడ్ల కొనుగోలును రాద్ధాంతం చేస్తూ.. రైతులను ఊసురు మనిపిస్తున్న టిఆర్ఎస్, బీజేపీ పార్టీల పాలనకు చరమగీతం పాడటానికి తెలంగాణ రాష్ట్ర ప్రజలు, రైతన్నలు ఇప్పటికైనా మేల్కొవాలని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కోరారు. పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలకు, టిఆర్ఎస్ సర్కార్ పెంచిన కరెంటు బిల్లులకు నిరసనగా టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, ప్రధాని, మోదీ, సీఎం కేసీఆర్ ల దిష్టి బొమ్మలను దహనం చేశారు. దిష్టి బొమ్మలను దగ్ధం చేయడాన్ని పోలీసులు అడ్డుకున్నప్పటికి కాంగ్రెస్ నాయకులు, పోలీసులను ప్రతిఘటించి వారి చేతుల్లో నుండి దిష్టిబొమ్మలను లాక్కొని నిప్పంటించారు. దీనితో కాసేపు గందరగోళం ఏర్పడింది. ఈసందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ రైతుల కోసమని కోటి మాగాణి కొరకు, 2 లక్షల కోట్లు పెట్టి కాళేశ్వరం కట్టిన కేసీఆర్ దగ్గర రైతుల వడ్లు కొనటానికి కనీసం 1000 కోట్లు లేకపాయేనని ఎద్దేవాచేశారు. మోదీ, కేసీఆర్ లు ఇద్దరు తోడు దొంగలన్నారు. రాష్ట్ర రైతులతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి డ్రామాలాడుతున్నాయని ఆరోపించారు. ఓ వైపు బిజెపి నాయకులు రైతులను వరి పండించండనీ, రాష్ట్ర రైతులు కెసిఆర్ మాటను పట్టించుకోకండి, తెలంగాణలో రైతు పండించిన వరి ప్రతి గింజను కేంద్ర ప్రభుత్వం కొంటుందని నమ్మించి, ఆ బాధ్యత నాది అని గొంతు చించి మాట్లాడటం ఎంపీ బండి సంజయ్ కే చెల్లిందన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని టిఆర్ఎస్ నిలదీయడానికి తెలంగాణలో బంధులు, నిరసనలు చేయడం కాదు, పంజాబ్ మాదిరిగా మంత్రులు ఎమ్మెల్యేలు ఢిల్లీలో దీక్షలు చేపట్టాలని అన్నారు. నిజంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్నట్లయితే.. కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టడం కోసం, రైతుల పక్షాన టిఆర్ఎస్ ప్రభుత్వ ఎమ్మెల్యే లు, మంత్రులు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని ఢిల్లీలో నిలదీయాలని కోరారు. రైతులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న డ్రామాలపై రైతులను జాగృతం చేస్తూ, రైతుల పక్షాన నిలబడి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతూ, రైతులపై టిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను తిప్పి కొడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన చివరి వరకు పోరాడుతుందని, రైతుల పంట కొనే వరకు, బిజెపి, టిఆర్ఎన్ ప్రభుత్వాలను అడుగడుగునా అడ్డుకొని, నిలదీస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో..నాయకులు..వైద్యుల అంజన్ కుమార్, శ్రావణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మడుపు మోహన్, తిరుపతి రెడ్డి, విక్టర్, లింగంపెల్లి బాబు, కుర్ర పోచయ్య, సత్యనారాయణ రెడ్డి, దండి రవీందర్, బాలబద్రి శంకర్, కొరివి అరుణ్ కుమార్, దన్న సింగ్, శేఖర్ బాబు, మంజుల, పొరండ్ల రమేష్, రోళ్ల సతీష్, జీడి రమేష్, అజ్మత్, జీలకర్ర రమేష్, సలీమొద్దిన్, కీర్తికుమార్, నదీమ్, శహింషా, సాయికిరణ్, రామ్మూర్తి, ఆమెర్, రాంరెడ్డి, ఆస్తపురం రమేశ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ , అటవీ శాఖకు సహాయకరంగా డి యస్ యస్ - పి ఈ సాఫ్ట్ వేర్..!

మెదక్, ఏప్రిల్ 4 (నేటి నిజం ప్రతినిధి) అటవీ ప్రాంతం వెలుపల ఉన్న వ్యవసాయ భూములు, ఇతర తోటల పెంపకం కోసం తగిన వ్యవసాయ అటవీ పద్ధతులను అనుసరించడంలో ఫారెస్ట్-ప్లస్ 2. 0 కార్యక్రమం క్రింద అభివృద్ధి చేయబడిన డెసిషన్ సపోర్ట్ సిస్టం -ప్రైవేట్ ఎంటిటీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో యూ యస్ ఏ ఐ డి వారిచే అభివృధిపరచిన డి యస్ యస్ - పి ఈ సాఫ్ట్ వేర్ వినియోగం పై వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామీణాభివృద్ధి సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, మత్స్య శాఖ అధికారులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి లోపలి పొరలు, వర్షపాతం, ఉష్ణోగ్రత, నేల లక్షణాల వంటి బయోఫిజికల్ అంశాలతో అనుసంధానించబడిన వెబ్ ఆధారిత అప్లికేషన్ డి యస్ యస్ - పి ఈ సాఫ్ట్ వేర్ అని అన్నారు. ఈ సాఫ్ట్ వేర్ ద్వారా నేల , తేమ, రక్షణ కార్యకలాపాలను గుర్తించి ఏ రకమైన పంటలు వేయాలో తగు కార్యాచరణ రూపొందించుకోవడంలో ఎంతో సహాయ పడుతుందన్నారు. ముఖ్యంగా ఆటవేతర ప్రాంతంలో పర్యావరణపరంగా ప్రయోజనకరమైన మొక్కల జాతుల శాస్త్రీయ సమాచారాన్ని సేకరించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా వ్యవసాయం, ఉద్యానవనం, పశువైద్యం, మత్స్య శాఖ, గ్రామీణాభివృద్ధి వంటి వివిధ ప్రభుత్వ శాఖలు ఆగ్రో ఫారెస్ట్రీ, ఫారం ఫారెస్ట్రీ ని ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సాఫ్ట్ వేర్ పనితీరు, ఉపయోగించు విధానంపై ఫారెస్ట్ ప్లస్ ప్రాంతీయ సంచాలకులు శైలు, బృందం సభ్యులు అంకిత రావత్ , అతీష్ ఖాన్ , ప్రొఫెసర్ డాక్టర్ వి. ఎస్. రాజు లు వివరించారు. ఇట్టి సాఫ్ట్ వేర్ ను ఫారెస్ట్ ప్లస్ అధికారులు మంగళవారం జిల్లా జాతీయ సమాచార కేంద్రానికి అందజేసి ఇంస్టాలేషన్, సిస్టమ్ సెటప్ చేస్తుంది.

ఈ కార్యక్రమంలో డి. ఆర్. డి. ఓ. శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి పరశురామ నాయక్, మత్స్య శాఖ అధికారి మల్లేశం, వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామీణాభివృద్ధి ఏ. పి. ఏం. లు, ఉద్యాన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5 న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 114 వ జయంతి వేడుకలు ఏర్పాట్లు..!!

సంగారెడ్డి, ఏప్రిల్ 04 (నేటి నిజం ప్రతినిధి) ఈ నెల 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 114 వ జయంతోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు సోమవారం నాడొక ప్రకటనలో తెలిపారు.

ఏప్రిల్ 5 న(మంగళవారం) ఉదయం సంగారెడ్డి పట్టణంలోని ఆర్ అండ్ బి ఆఫీస్ పక్కన గల డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలంకరణ గావిస్తారని తెలిపారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు.

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవానికి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై జయంతోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ధాన్యాన్ని కేంద్రం కొనాల్సిందే

కేంద్రం ధాన్యం కొనుగోలు కొనేదాకా కేంద్రంపై యుద్ధమే

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగం పండించిన వే సం గి వరి ధాన్యాన్ని కేంద్రం కొనాల్సిందేనని ధాన్యం కొనేదాకా కేంద్రంపై యుద్ధమేనని టీఆర్ఎన్ నాయకులు అన్నారు .

వేములవాడ పట్టణంలో ని తెలంగాణ చౌక్ లో కేంద్రం వరి ధాన్యం కొనుగోలు చేయాలని టిఆర్ఎస్ పార్టీ టౌన్ అర్బన్ రూరల్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చెయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం పై వివక్ష చూపుతోందని ఆరోపించారు.

దేశంలోని పంజాబ్ గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో దాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తూ తెలంగాణ లో పండిన వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడంలో కొర్రిలు పెడుతుందని విమర్శించారు.

ఉద్యమాలు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్న పోరాట స్ఫూర్తితో రాష్ట్ర రైతాంగ సంక్షేమం కోసం ఎన్ని రోజులైనా ఉద్యమం తీవ్రరూపం దాల్చి కేంద్రం మెడలు వంచి కేంద్రంతో వడ్లు కొనుగోలు చేస్తామని నాయకులు హెచ్చరించారు ... నిరసన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పుల్కం రాజు, ఊరడి ప్రవీణ్, గోస్కుల రవి, మున్సిపల్ చైర్పర్సన్ రామాతీర్థపు మాధవి ,మార్కెట్ కమిటి చైర్మన్ గడ్డం హన్మమాండ్లు,ఎంపిపి బూర వజ్రమ్మ , జడ్పిటిసి మ్యాకల రవి , సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డ గారు,సహకార సంగం అధ్యక్షుడలు ఏనుగు తిరుపతి రెడ్డి ,రేగులపాటి కృష్ణదేవ రావు , కౌన్సిలర్లు,రూరల్ రైతుబంధు సమితి అధ్యక్షులు కటం మల్లేశం, గౌరవ సర్పంచ్లు,ఎంపిటీసిలు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,సీనియర్ నాయకులు,వార్డు అధ్యక్షులు,అనుభంధ సంఘాల అధ్యక్షులు,మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పబ్ నిర్వహిస్తున్న నిర్వాహకులు

హైదరాబాద్, ఏప్రిల్ 4: టాస్క్ ఫోర్స్ పోలీసల దాడితో డ్రగ్స్ గుట్టు రట్టయిన పుడింగ్ మించ్ పబ్ నిబంధనలకు విరుద్ధంగా పబ్ నడిపిస్తున్న పోలీసలు విచారణలో తేలింది. నిబంధనలకు విరుద్ధంగా 24 గంటలు పబ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.టాస్క్ఫోర్స్ దాడితో నిర్వాహకుల బాగోతం వెలుగు చూసింది. రాడిసిన్ 5 స్టార్ హోటల్‌కు 24 గంటల పాటు మద్యం సరఫరా చేసేందుకు అనుమతి వుంది. అయితే అది రాడిసన్ హోటల్ రూమ్‌లో ఉన్నవాళ్లకు మాత్రమే పరిమితం. హోటల్ లో వున్న వారికే మద్యం సప్లై చేయాలని కచ్చితమైన నిబంధన వుంది. కానీ రాడిసిన్ 5 స్టార్ హోటల్ అనుమతిని చూపి ఇంద? లోని పబ్ నిర్వాహకులు పబ్‌ను సైతం 24 గంటలు నడిపిస్తున్నతేలింది. పబ్‌కు 24 గంటల అనుమతి ఉందనుకుని యువత క్యూ కడుతోంది.

హనుమంత వాహనంపై శ్రీరాముడి దర్శనం..

తిరుపతి, ఏప్రిల్ 04: తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇవాళ స్వామివారు హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కళాబృందాల కోలాటాలు ఆకట్టుకున్నాయి. త్రేతాయుగంలో రామభక్తునిగా, భగవ ద్భక్తులలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధిగాంచిన వాడు హనుంతుడని ఆలయ అర్చకులు తెలిపారు.

రాముడు భక్తాగ్రగణ్యుడైన హనుమకు ఆత్మతత్వాన్ని బోధించినట్లు ప్రాచీన వాఙ్మయం నుంచి తెలుస్తోందని వివరిం చారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఊంజల్‌సేవ, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గజ వాహనంపై శ్రీ కోదండ రామస్వామివారు భక్తులకు కనువిందు చేయనున్నారు. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో పార్వతి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

హైదరాబాద్, ఏప్రిల్ 4: రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలను అభివృద్ధి చే సేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్, కుషాయిగూడ శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియో జకవర్గ పరిధిలోని ఆలయాలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటా యించి.. పనులు చేపడుతున్నామని, ఇప్పటికే ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, హెచ్‌బీకాలనీ, నాచారం, ఏఎస్‌రావునగర్ తదితర డివిజ న్‌లలోని ఆలయాలను అభివృద్ధి చేశామన్నారు. మిగిలి ఉన్న ఆలయా లను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఆలయంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్